సాక్షి
అన్నమయ్య జిల్లా
ఆదివారం । 27 । జూలై । 2025



రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం

ప్రయివేటు ఫైనాన్స్ పనులు చూసుకుని తిరిగి బైక్‌పై వెళ్తున్న ఇద్దరినిగుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో.. దుర్మరణం చెందిన ఘటన బి.కొత్తకోట మండలంలో జరిగింది - 8లో



రాజ్యాధికారంతోనే బీసీల అభ్యున్నతి

రాజ్యాధికారంతోనే బీసీ వర్గాల అభ్యున్నతి సాధ్యమని బీసీ కులాల వేదిక నాయకులు పేర్కొన్నారు. బీసీలకు రాజ్యాధికారం సాధించడమే లక్ష్యంగా వేదిక పని చేస్తుందని అన్నారు. - 8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.380	రూ.500
రెండోరకం	రూ.200	రూ.370



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 330 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	660	612
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 233.040 కిలోలు

న్యూస్‌రీల్

హాస్టళ్లను శుభ్రంగా ఉంచాలి

రాయచోటి : వెనుకబడిన తరగతుల శాఖ ఆధ్వర్యంలో నడపబడుతున్న హాస్టళ్ల నిర్వహణలో లోపాలు ఉంటే కఠినచర్యలు తప్పవని జిల్లా వెనుకబడిన సంక్షేమ శాఖ అధికారి సు రేష్ కుమార్ హెచ్చరించారు. శనివారం కలెక్టరేట్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ సంక్షేమ హాస్టళ్లను శుభ్రంగా ఉంచాలన్నారు. ఉద్యోగులు సమయపాలన పాటించాలన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు వెనుకబడిన తరగతులశాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న హాస్టళ్ల నిర్వహణపై సమాచారం అందివ్వనున్నట్లు ఆయన తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

రాజంపేట : అన్నమయ్య జిల్లా రాజంపేట మండలం నారమరాజుపల్లెలోని జవహర్‌నవోదయ విద్యాలయంలో 2026–2027 విద్యాసంవత్సరానికి 9 వ తరగతి ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ గీత ఒక ప్రకటనలో తెలిపారు. 2025–2026 సంవత్సరంలో 8వ తరగతి చదుతున్న విద్యార్థులందరూ అర్హులేనన్నారు. దరఖాస్తు ఫారాలను ఆన్‌లైన్, నవోదయ వెబ్‌సైట్‌లలో ఉంటాయన్నారు. 2026 ఫిబ్రవరి 7న దరఖాస్తు చేసుకున్న వారికి ప్రవేశపరీక్ష నిర్వహించనున్నామని వివరించారు.

రెవెన్యూ మ్యానువల్ ఆవిష్కరణ



సవరించిన రెవెన్యూ మ్యాన్యువల్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ శ్రీధర్, జేసీ తదితరులు

రాయచోటి : సవరించిన రెవెన్యూ మ్యాన్యువల్ పుస్తకాలను జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఆవిష్కరించారు. శనివారం రాయచోటి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదర్శరాజేంద్రన్, మదనపల్లె సబ్ కలెక్టర్ మేఘస్వరూప్‌లతో కలిసి ఆవిష్కరణ చేశారు. సవరించిన 14 రెవెన్యూ మ్యాన్యువల్‌లు (అసైన్‌మెంట్ భూములు, చుక్కల భూములు, పెన్షన్ రూల్స్ తదితర అంశాలు) సిబ్బందికి అందుబాటులో ఉన్నాయని కలెక్టర్ అన్నారు. వీటిని రెవెన్యూ శాఖ అధికారులు, సిబ్బంది పరిపాలనలో వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాయచోటి ఆర్డీఓ శ్రీనివాస్, అన్నమయ్య జిల్లాలోని తహసీల్దార్లు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో సీట్ల కోసం లాటరీ డ్రా

రాయచోటి జగదాంబసెంటర్ : కడప, అన్నమయ్య జిల్లాలలోని బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించి 5వ తరగతిలో మిగిలిన సీట్లను లాటరీ పద్ధతిలో నింపుతున్నట్లు జిల్లా సమన్వయాధికారి ఎ.ఉదయశ్రీ శనివారం తెలిపారు. ఈ లాటరీ డ్రా కార్యక్రమం కడప జిల్లాలోని అంబేడ్కర్ గురుకులాల కోసం ఈ నెల 31న కమలాపురంలోని గురుకుల పాఠశాలలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. అదే రోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి లాటరీ ద్వారా సీట్లు కేటాయించనున్నట్లు చెప్పారు. అన్నమయ్య జిల్లా కోసం ఆగస్టు 8వ తేదీన రాయచోటిలోని అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. అదే రోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి లాటరీ ద్వారా సీట్లు కేటాయించనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాల కొరకు కడప, అన్నమయ్య జిల్లాల్లో ని స్థానిక అంబేడ్కర్ గురుకుల పాఠశాలల్లో సంప్రదించాలని ఆమె తెలియజేశారు. ప్రవేశ పరీక్ష రాయని వారు కూడా అర్హులని తెలిపారు.

సంక్షేమం.. సంక్షోభం

వసతి గృహాల్లో వసతులు కరువు

- కటిక నేలపై విద్యార్థుల పడక
- సక్రమంగా అందని మెనూ
- విద్యార్థులకు తప్పని అవస్థలు

చప్పిడి మెతుకులు..సాగని చదువులు..సౌకర్యాలు నాస్తి..సమస్యలు జాస్తి..మెనూ బరువు.. తాగేందుకు నీళ్లు కరువు. పరిసరాలు రోత..దోమల మోత..పెచ్చులూడే భవనాలు..విరిగిన కిటికీలు....ఇదీ జిల్లాలోని వసతి గృహాల దుస్థితి. హాస్టళ్లలో నెలకొన్న అధ్వాన పరిస్థితులకు సంబంధించి ఉన్నతాధికారులపై హై కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా 'సాక్షి'నిర్వహించిన హాస్టల్ విజిట్‌లో విస్తుపోయే అంశాలు వెలుగు చూశాయి.

సాక్షి గ్రౌండ్ రిపోర్ట్

రాయచోటి : జిల్లా వ్యాప్తంగా 115 ప్రభుత్వ ఎస్సీ ఎస్టీ బీసీ వసతి గృహాల్లో 9114 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. హాస్టళ్లలో ఉన్న సమస్యలతో సతమతం అవుతున్నారు. ఒక దశలో వారికి ప్రత్యక్ష నరకం కనిపిస్తోంది. వారి విద్యాభివృద్ధికి 'వసతి సౌకర్యాలు'పెను సమస్యగా మారాయి. టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది దాటింది. అంతకు ముందు మెరుగైన వసతులతో వెలుగొందిన హాస్టళ్లు, నేడు సమస్యల చీకట్లతో కొట్టు మిట్టాడుతున్నాయి. చాలా హాస్టళ్లలో 'మెనూ'దారి తప్పింది. 2023లో నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మెను ఛార్జీలను పెంచడంతో పాటు రుచి, శుచికరమైన వంటలను విద్యార్థులకు వడ్డించడానికి వంట వారికి శిక్షణను కూడా ఇప్పించారు. తరువాత నిత్యావసర ధరల్లో పెను మార్పులు సంభవించాయి. దీంతో మెను అమలు ×పలుచ¥బడింది. మెను అమలులో భాగంగా విద్యార్థులకు అందించే గుడ్డు, అరటి పండుకే ఎక్కువ డబ్బు ఖర్చు అవుతోందని వార్డెన్లు (హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్స్) అంటున్నారు. ధరలు పెరిగిన నేపథ్యంలో ప్రభుత్వం డైట్ బిల్లులను పెంచాల్సిన అవసరం ఉందనే అభిప్రాయంను వ్యక్తం చేస్తున్నారు.

అందని దుప్పట్లు..

ఎస్సీ, బీసీ హాస్టళ్లలో ప్రీ మెట్రిక్ 3 నుంచి 10వ తరగతి వరకు చదివే విద్యార్థులు ఉంటారు. వారంతా కటిక నేలపైనే పడుకుంటున్నారు. తమ ఇంట్లో ఎంత నిరుపేదలైనా నులక మంచంపైనైనా నిద్రిస్తారు. ఇక్కడ ప్రభుత్వ హాస్టళ్లలో మాత్రం నేలపైనే పడుకుంటున్నారు. గ్రామీణ ప్రాంతంలోనే ఉండే హాస్టళ్లలో విద్యార్థులు కింద పడుకోవడం వల్ల విష సర్పాలు, ఇతర కీటకాలతో పెను ప్రమాదం సంభవించే అవకాశం ఉంది. ప్రధానంగా జూన్ 12వ తేదీ నుంచి పాఠశాలలతో పాటే హాస్టళ్లు కూడా ప్రారంభమయ్యాయి. హాస్టళ్లు ప్రారంభం రోజు లేదంటే వారం, పది రోజుల్లో ఒక విద్యార్థికి కప్పుకోవడానికి ఒక దుప్పటి, కింద పరచుకోవడానికి ఒక కార్పెట్ ఇవ్వాలి. అయితే ఒకటిన్నర నెల అవుతున్నా విద్యార్థులకు దుప్పటి, కార్పెట్ ఇవ్వకపోవడం శోచనీయం. ప్రస్తుతం వర్షాలు పడుతున్నాయి. చలి వాతావరణం నెలకొంది. అసలే చిన్న పిల్లలు ఆపై అనుకూలించని వాతావరణం. దీంతో ఇంటి వద్ద నుంచి తెచ్చుకున్న దుప్పటి లేదా సహచర మిత్రుని కుండే దుబ్బటితోనే సరిపెట్టుకుంటున్నారు. అలాగే ట్రంక్ పెట్టె, ప్లేటు, గ్లాసు మూడేళ్లకు ఒక సారి ఇవ్వాలి. చాలా మందికి ట్రంక్ పెట్టె అందని పరిస్థితి ఏర్పడింది. బీసీ హాస్టళ్లలో సమస్యల తీవ్రత ఎక్కువగా కనిపిస్తోంది. జిల్లాలో ప్రీ మెట్రిక్ హాస్టళ్లకు సంబంధించి బీసీ సంక్షేమ శాఖ పరిధిలో 12, ఎస్టీ హాస్టళ్లు 3, ఎస్సీ హాస్టళ్లు 9 ప్రైవేట్ భవనాల్లో నడుస్తున్నాయి. ప్రభుత్వ వసతి గృహాల కంటే ప్రైవేట్ హాస్టళ్లు అద్దె భవనాల్లో వసతులు దారుణంగా ఉన్నాయి. చాలా వరకు ప్రీ మెట్రిక్‌తో పాటు కళాశాల హాస్టళ్లలో విద్యార్థులకు సరిపడే మరుగు దొడ్లు, బాత్ రూమ్‌లు లేక ఇబ్బందులు పడుతున్నారు.

- సంబేపల్లె బీసీ బాలుర హాస్టల్‌లో విద్యార్థులకు తాగునీరు లేకపోవడంతో ట్రాక్టర్ల ద్వారా నీటిని అందిస్తున్నారు. వర్షాలు పడితే ఉరుస్తున్నాయి. పై పెచ్చులు ఊడిపడే ప్రమాదం ఉంది. చాలాచోట్ల విద్యార్థులు హాస్టల్‌లో ఆహారం తిని ఇండ్లకు వెళుతున్నారు.
- కిటికీలకు మెష్‌లు లేకపోవడంతో లోపలికి దోమలు, ఈగలు వస్తున్నాయి. విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.
- రైల్వేకోడూరు పట్టణంలోని ఎస్సీ బాలికల హాస్టల్‌లో వసతులు అధ్వానంగా ఉన్నాయి. హాస్టల్లో విద్యార్థినులు చదువుకోవడానికి ఉన్న ప్రదేశాలలో ఫ్లోరింగ్ దెబ్బతింది. అలాగే స్నానపు గదులకు తలుపులు సరిగా లేవు. హాస్టల్‌కు రక్షణ గోడ కూడా లేదు.



ఓబులవారిపల్లె : అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో మంచాలు లేక నేలపైన నిద్రిస్తున్న విద్యార్థులు

పేపర్ వర్క్‌కే పరిమితమైన నిధుల మంజూరు

రాజంపేట టౌన్ : రాజంపేటలో శిథిలావస్థకు చేరుకున్న ఎస్సీ బాలుర హాస్టల్ భవనాల మరమ్మతులకు ప్రభుత్వం గత ఆర్థిక సంవత్సరంలో రూ.61.23 లక్షలు మంజూరు చేసినట్లు అధికారులు చెబుతున్నారు. అయితే ఇప్పటి వరకు నిధులు మాత్రం మంజూరు కాకపోవడంతో అవి పేపర్ వర్క్‌కే పరిమితమైనట్లు కనిపిస్తోంది. ఇటీవల కాలంలో అధికారులు ఎస్సీ బాలుర హాస్టల్‌ను తనిఖీ చేసి భవనాలు పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయని, మరమ్మతులు చేపట్టినా ఫలితం ఉండదని ఉన్నతాధికారులకు నివేదికలు కూడా పంపారు. అందువల్ల ప్రభుత్వం 61.23 లక్షలు నిధులు విడుదల చేసినా ఫలితం ఉండదు. హాస్టల్‌ను పూర్తిగా తొలగించి కొత్త హాస్టల్ నిర్మించాలంటే దాదాపు రూ.2 కోట్లకు పైగా వ్యయం అయ్యే అవకాశం ఉంది.

కటిక నేలపైనే నిద్ర..

ఓబులవారిపల్లె : ఓబులవారి మండలం సంజీవపురం అంబేడ్కర్ బాలుర గురుకుల కళాశాలలో విద్యార్థులు డార్మెటరీలో మంచాలు లేకపోవడంతో నేలపై నిద్రిస్తున్నారు.పాఠశాలలో 620 మంది విద్యార్థులు ఉన్నారు. ఆరో తరగతి నుండి ఇంటర్మీడియట్ వరకు తరగతులు నిర్వహిస్తున్నారు. అందరికీ మంచాలు లేకపోవడంతో నేలపైనే పడుకుంటున్నారు. రానున్నది వర్షాకాలం కావడంతో విద్యార్థులు కష్టాలు మరింత ఉన్నాయి.

జిల్లాలోని హాస్టళ్ల వివరాలు

శాఖ	విభాగం	హాస్టళ్లు	విద్యార్థులు
ఎస్సీ	ప్రీ మెట్రిక్	47	
	పోస్ట్ మెట్రిక్	08	4409
బీసీ	ప్రీ మెట్రిక్	33	2422
	పోస్ట్ మెట్రిక్	12	826
ఎస్టీ హాస్టల్స్		12	1457

భయంగా ఉంటుంది



హాస్టల్‌లో అన్ని గదులు దెబ్బతిన్నాయి. అందువల్ల ఇక్కడ ఉండాలంటే భయంగా ఉంటుంది. పేదరికం వల్ల మేము హాస్టల్‌లో ఉండి చదువుకుంటున్నాము. ఇప్పుడు వర్షాలు కురుస్తున్నాయి. అందువల్ల భవనాలు ఎక్కడ కూలుతాయో అని ఆందోళనగా ఉంది. దోమలబెడద కూడా ఎక్కువంగా ఉంది. కిటకీలకు మెస్ ఏర్పాటు చేయాలి. ఉన్నతాధికారులు స్పందించి ఎలాంటి ప్రమాదం జరగకముందే హాస్టల్‌ను వేరేచోటికి మార్చాలి.

– జగన్, తొమ్మిదవ తరగతి విద్యార్థి.

సమస్యలను పరిష్కరిస్తాం...

హాస్టళ్లలో ఎలాంటి ఇబ్బందులు లేవు. ఒక నెలకు సబంధించిన డైట్, కాస్మొటిక్ బిల్లులు రావాల్సి ఉంది. విద్యార్థుల అభ్యున్నతికి కృషి చేస్తాం. ప్రభుత్వ హాస్టళ్లపై జిల్లా కలెక్టర్ ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తున్నారు. మండల స్థాయి అధికారులు కూడా కలెక్టర్ ఆదేశాల మేరకు వివరాలను తెలుసుకుంటున్నారు. సమస్యలను కలెక్టర్ ద్వారా పరిష్కారానికి చర్యలు చేపట్టాం.. – సురేష్ కుమార్, జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి




రైల్వేకోడూరులో రక్షణ గోడలేని ఎస్సీ బాలికల హాస్టల్



సంబేపల్లె బీసీ వసతి గ్రహంలో కిటికి మెస్ చినిగిపోయిన దృశ్యం

వసతి గృహం కాదు..శిథిల గృహం



శిథిలావస్థలో ఉన్న ఎస్సీ బాలుర హాస్టల్

రాజంపేట టౌన్ : ఏదైనా ఒక భవనం కాలపరిమితి యాబైఏళ్ళు ఉంటుంది. యాబై ఏళ్ల పూర్తయిన భవనాలు బాగున్నా వాటిని తొలగించాల్సి ఉంటుంది. ఎందుకంటే యాబై ఏళ్ల క్రితం పిల్లర్లు లేకుండా భవనాలను నిర్మించేవారు. ఈ భవనాల పటిష్టత కాలం గడిచే కొద్ది దెబ్బతింటుంది. ఈకారణంగా పెద్ద, పెద్ద నగరాల్లో యాబై ఏళ్లు దాటిన ఇళ్లు, భవనాలను అధికారులు యజమానులకు నోటీసులు జారీ చేసి కూల్చివేయిస్తారు. ఇదిలా ఉంటే రాజంపేట పట్టణం వత్తలూరురోడ్డులో ఉన్న ఎస్సీ బాలుర హాస్టల్ శిథిలావస్థకు చేరుకొని కూలేందుకు సిద్ధంగా ఉంది. ఈ హాస్టల్‌ను 1972లో నిర్మించారు. హాస్టల్‌ను నిర్మించి 53 సంవత్సరాలయింది. అందువల్ల హాస్టల్ అంతా పూర్తిగా దెబ్బతినివుంది. ఈహాస్టల్‌లో మొత్తం 18 గదులు ఉన్నాయి. అందులో 14 బాగా దెబ్బతిన్నాయి. కేవలం నాలుగు గదుల్లో మాత్రమే విద్యార్థులు ఉంటున్నారు. ఈనాలుగు గదుల్లో కూడా శ్లాబు పెచ్చులూడి పడుతుంటాయి.

వసతుల లేమి.. తప్పని ఇబ్బందులు



వృథాగా ఉన్న ములకలచెరువు బీసీ హాస్టల్ మరుగుదొడ్లు

మదనపల్లె : మదనపల్లె పట్టణంలో ప్రభుత్వ ఆధ్వర్యంలో రెండు బాలుర, రెండు బాలికలకు, ఒక కళాశాల ఎస్సీ హాస్టళ్లు, బీసీ సంక్షేమ హాస్టళ్లు ఐదు, గిరిజన సంక్షేమ హాస్టల్ ఒకటి నడుస్తున్నాయి. వీటిలో ఒక్క హాస్టల్‌లోనూ నిబంధనల ప్రకారం, మెనూ ప్రకారం ఏది జరగడం లేదు. మగురుదొడ్లు, దుప్పట్లు, బెడ్లు, తాగునీటి ఇబ్బందులు నెలకొన్నాయి. తంబళ్లపల్లె నియోజకవర్గంలోని బి.కొత్తకోట గురుకుల విద్యాలయ విద్యార్థుల అవస్థల మధ్య ఉంటున్నారు. తంబళ్లపల్లెలో బీసీ హాస్టల్‌ను ప్రభుత్వం మూసివేయగా ఎస్టీ బాలుర హాస్టల్ విద్యార్థులకు మంచినీరు కరువైంది. సౌకర్యాల మాటే లేదు. మిగతా హాస్టళ్లలోనూ ఇదే పరిస్థితులు నెలకొన్నాయి.



బి.కొత్తకోట గురుకుల హాస్టల్‌లో పెచ్చులూడుతున్న పైకప్పు

ఉపరితల జలాశయం లేక..



ముక్కావారిపల్లె గురుకుల పాఠశాలలో అపరిశుభ్రంగా ఉన్న నీటి ట్యాంకు

ఓబులవారిపల్లె : ముక్కావారిపల్లి గురుకుల పాఠశాల నందు ఉపరితల జలాశయం లేకపోవడంతో విద్యార్థులు నీటికోసం ప్రతినిత్యం ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాలలో మూడుబోర్లు ఉన్నా ఉపరితల జలాశయం లేకపో వడంతో నీటి కష్టాలు ఎదురవుతున్నాయి.

బాత్‌రూమ్‌ల కొరత.....

ఓబులవారిపల్లె మండలం సంజీవపురం అంబేడ్కర్ గురుకుల పాఠశాలల్లో 620 మంది విద్యార్థులు ఉన్నారు.మరుగుదొడ్లు తక్కువగా ఉండటంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. వీటి నిర్వహణ భారంగా మారుతోందని వాపోతున్నారు. విద్యార్థులందరూ ఒకే సమయంలో పాఠశాలకు వెళ్లాల్సి వస్తుండటంతో కొంతమంది ఆరుబయటే స్నానాలు చేస్తున్నారు.



ట్రిపుల్ ఐటీ.. కులాల కుంపటి!

- అణగారిన వర్గాలకు చెందిన అధ్యాపకులపై వివక్ష
- కుల అహంకారంతో రెచ్చిపోయి అనుచిత వ్యాఖ్యలు
- భరించలేక డైరెక్టర్‌కు ఫిర్యాదు చేసిన తెలుగుశాఖ మెంటార్
- విచారణకు ఆదేశించిన డైరెక్టర్... ఆపై 'కమ్మ'ని ఒత్తిళ్లు



సాక్షి ప్రతినిధి, కడప : అధ్యాపకులు విలువలను గాలికొదిలేస్తున్నారు. చదువు..సంస్కారాన్ని మరిచి కులాల కుంపట్లలో మునిగి తేలుతున్నారు. రేపటి సమాజాన్ని నిర్మించాల్సిన స్థానంలో ఉండి 'గురు'తర బాధ్యతలను విస్మరిస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. ఇడుపులపాయ ఆర్కే వ్యాలీ ట్రిపుల్ ఐటీ అధ్యాపకుల మధ్య కులాల రగడ మొదలైంది. ఉన్నతస్థాయిలో ఉంటూనే వ్యక్తిత్వ లోపంతో కులాల పరంగా దూషణలకు దిగుతున్నారు. అణగారిన వర్గాలకు చెందిన అధ్యాపకులపై వివక్ష చూపిస్తున్న ఘటన తాజాగా తెరపైకి వచ్చింది.

ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీ తెలుగుశాఖ చెందిన ఓ మెంటార్‌పపై ఆదే శాఖకు చెందిన భార్యాభర్తలైన అధ్యాపకులు కులంపేరుతో దూషణలకు దిగారు. వ్యక్తిగత జీవితంపై అనుచిత వ్యాఖ్యలు చేశారు. విద్యాసంస్థపై దిగజారుడు మాటలు మాట్లాడారు. ఇలాంటి ఘటనలు ముందెన్నడూ ఉత్పన్నం కాలేదు. గడిచిన ఏడాదిగా ట్రిపుల్ ఐటీ క్యాంటీన్ల కోసం అటు తెలుగుదేశం పార్టీ వర్గీయుల దౌర్జన్యం, ఇటు ఆదే సామాజికవర్గానికి చెందిన అధ్యాపకుల అనుచిత వ్యాఖ్యలు తరచూ తెరపైకి వస్తున్నాయి. ఈ పరిస్థితులల్లో తెలుగుశాఖ మెంటార్ డైరెక్టర్‌కు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. భార్యాభర్తలైన అధ్యాపకులిద్దరు వ్యవహరించిన, దూషించిన, అవమానపర్చిన ధోరణిని అందులో వివరించారు. ఆపై డైరెక్టర్ కుమారస్వామి గుప్తా కంప్యూటర్ సైన్సు ప్రొఫెసర్ రత్నకుమారి ఛైర్మన్‌గా ఒక కమిటీ ఏర్పాటు చేశారు. విచారించి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. ఈ క్రమంలో తెలుగు మెంటార్‌పై అనుచిత వ్యాఖ్యానాలు, దూషణలు నిజమేనని మరో ఇద్దరు మెంటార్లు చెప్పుకొచ్చారు. దాంతో దంపతులిద్దరికీ చిర్రెత్తుకొచ్చింది. తనపై ఏకంగా అత్యాచారానికి పాల్పడ్డారని సదరు భార్య డైరెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఇవన్నీ విచారణ కమిటీ ముందుకు వచ్చాయి. కమిటీ ఛైర్మన్, సభ్యులు విచారణ పూర్తి చేసి నివేదికను డైరెక్టర్‌కు సమర్పించారు.

చర్యలకు వెనుకంజ...

ఉన్నత స్థాయి విద్యా సంస్థలో కులాలు కుంపట్లు తెరపైకి తేవడాన్ని డైరెక్టర్ తీవ్రంగా పరిగణించాల్సి ఉంది. కాగా కమిటీ రిపోర్టును సైతం తొక్కిపెట్టినట్లు ఆరోపణలు విన్పిస్తున్నాయి. అధ్యాపకులైన దంపతులకు అండగా ×కమ్మ¥గా హైలెవెల్ ఒత్తిడులు వచ్చినట్లు సమాచారం. వివాదాస్పదులైన అధ్యాపకుల దంపతులు పనితనంలోని అశ్రద్ధ, నిర్లక్ష్యం, బెదిరింపు ధోరణులు ఇలా అనేకం తెరపైకి వచ్చినట్లు విశ్వసనీయ సమాచారం. ఇలాంటి పరిస్థితుల్లో కూడా కంటితుడుపు చర్యలకు మాత్రమే పరిమితమైనట్లు పలువురు వాపోతున్నారు. కాగా, ఈ విషయమై ఆర్కేవ్యాలీ ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్ కుమారస్వామిగుప్తా వివరణ కోరగా అదంతా ఇంటర్నల్ వ్యవహారం, పైగా ఇష్యూ సమసిపోయిందని చెప్పుకొచ్చారు. అసలు విషయం వెల్లడించేందుకు నిరాకరించడం గమనార్హం.

క్లుప్తంగా

8 ఎర్రచందనం దుంగల పట్టివేత



నిందితుడు, ఎర్రచందనం దుంగలతో అటవీ అధికారులు

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు అటవీ శాఖ పరిధిలోని కోడూరు రేంజ్ నాగులపెంట బీట్ వద్ద శనివారం రేంజర్ శ్యాంసుందర్ ఆధ్వర్యంలో కూంబింగ్ చేపట్టారు. తమిళనాడుకు చెందిన ఆనంద్‌రాజ్ జయశంకర్ 1 లక్షా 22 వేల విలువ చేసే 8 ఎర్రచందనం దుంగలను తరలిస్తుండగా అధికారులు దాడులు చేసి పట్టుకొన్నారు. నిందితుడిని కోర్టులో హాజరుపరిచారు. దాడుల్లో అటవీ శాఖ సిబ్బంది రమణ, మహేష్‌శంకర్, దామోదర్, పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

బాత్‌రూమ్‌లో జారిపడి ఏపీఎస్పీ సీఐ మృతి



కృష్ణానాయక్ (ఫైల్)

మదనపల్లె రూరల్ : బాత్‌రూమ్‌లో జారిపడి ఏపీఎస్పీ సీఐ మృతి చెందిన ఘటన శనివారం మదనపల్లెలో జరిగింది. తంబళ్లపల్లె మండలం కొటాలకు చెందిన పిల్ల స్వామినాయక్ కుమారుడు కృష్ణానాయక్ (58) పట్టణంలోని రెడ్డీస్‌కాలనీలో నివాసం ఉంటున్నాడు. ఆయన చిత్తూరులోని ఏపీఎస్పీ 8వ బెటాలియన్ సీఐగా పని చేస్తున్నాడు. నాలుగు రోజుల క్రితం వ్యక్తిగత పనుల నిమిత్తం సెలవులో ఇంటికి వచ్చారు. హైదరాబాదులో పనులు ముగించుకుని వచ్చిన ఆయన శనివారం ఉదయం బాత్‌రూమ్‌కు వెళ్లి జారిపడటంతో అక్కడే కుప్పకూలిపోయారు. గమనించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన అత్యవసర విభాగం వైద్యులు ఆయన అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఆయన ఇద్దరు భార్యల్లో మొదటి భార్య రమణిభాయ్ 2003లో మృతి చెందగా, ఆమెకు రాఘవేంద్రనాయక్, గీతాభాయ్ ఇద్దరు పిల్లలు ఉన్నారు. ప్రస్తుతం రెండో భార్య సునీతతోపాటు ఆమె కుమార్తె శృతి ఉన్నారు.

గంజాయి విక్రేతల అరెస్ట్

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : కడప నగరంలో గంజాయి విక్రయిస్తున్న ఐదుగురిని అరెస్ట్ చేసినట్లు కడప ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ సీఐ కృష్ణకుమార్ పేర్కొన్నారు. వీరి వద్ద నుంచి 1.5 కిలోల గంజాయి, 4 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు.

రాజ్యాధికారంతోనే బీసీల అభ్యున్నతి

- రాజధానిలో బహిరంగ సభ.. ఉద్యమ కార్యాచరణ
- సమావేశంలో బీసీ కులాల వేదిక నేతలు



సమావేశంలో సంఘీభావం తెలుపుతున్న బీసీ కులాల వేదిక నేతలు

కడప రూరల్ : రాజ్యాధికారంతోనే బీసీ వర్గాల అభ్యున్నతి సాధ్యమని బీసీ కులాల వేదిక నాయకులు పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రతి కులానికి రాజకీయ ప్రాధాన్యత కల్పించడం, బీసీలకు రాజ్యాధికారం సాధించడమే లక్ష్యంగా వేదిక పని చేస్తుందని వారు స్పష్టం చేశారు. కడపలోని బీసీ భవనంలో శనివారం బీసీ కులాల వేదిక ఆధ్వర్యంలో బీసీ కులాల రాయలసీమ జిల్లాల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వబ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షులు పావులూరి హనుమంతరావు మాట్లాడుతూ రాష్ట్రంలోని పార్టీలు బీసీలకు అన్ని విధాలా అన్యాయం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి పార్టీ ఎన్నికలకు ముందు బీసీ కులాలకు వరాలు ఇవ్వటం, గెలిచిన తరువాత మరిచిపోవటం పరిపాటి అయ్యిందని పేర్కొన్నారు. ఇక నుంచి ఓట్లు మావి సీట్లు కూడా మావే అనే నినాదంతో బీసీ కులాల వేదిక పని చేస్తుందని అన్నారు. స్థానికంగా జనాభా ఉన్న కులాలకు మాత్రమే అన్ని పార్టీలు అవకాశం ఇస్తున్నాయని, రాష్ట్ర వ్యాప్తంగా జనాభా ఉన్న కులాలను పట్టించుకోవటం లేదని తెలియజేశారు. నాయీ బ్రాహ్మణ సంఘం రాష్ట్ర నాయకులు ఇంటూరి బాబ్జి నంద మాట్లాడుతూ ఇప్పటి వరకు రాజ్యాధికారంలో భాగస్వామ్యం లేని కులాలను అసెంబ్లీ, పార్లమెంట్ లోకి తీసుకొని పోవటానికి ప్రతి బీసీని చైతన్యం చేస్తామని తెలియజేశారు. 150కి పైగా ఉన్న బీసీ కులాలలో కేవలం 5, 6 కులాలకే అన్ని పార్టీలు ప్రాధాన్యత కల్పిస్తున్నాయని మిగిలిన కులాలను డబ్బులు లేవనో, కుల జనాభా లేదనో చట్టసభల్లో అవకాశం కల్పించటం లేదని అన్నారు. రాజ్యాధికారంలో భాగస్వామ్యం లేని కులాలు తమ హక్కులను సాధించుకోలేవని, బీసీలు రాజ్యాధికారంలో ఉంటేనే రాజ్యాంగాన్ని మార్చాగలరని, ఆ దిశగా బీసీ కులాల వేదిక కృషి చేస్తుందని అన్నారు.

రాష్ట్ర వ్యాప్తంగా సమావేశాలు

కుమ్మర శాలివాహన రాష్ట్ర నాయకులు గొల్లపల్లి లలిత్ ప్రజాపతి మాట్లాడుతూ భారత రాజ్యాంగంలోనే బీసీల రిజర్వేషన్స్ సరిగా జరగలేదని, బీసీలకు కేవలం విద్యా, ఉద్యోగాలలో మాత్రమే రిజర్వేషన్స్ కల్పించారని దానికి కూడా క్రీమిలేయర్ పెట్టి రిజర్వేషన్స్ ఫలాలు బీసీలకు సరిగా అందకుండా చేశారన్నారు. దళితులకు జనాభా ప్రాతిపదికన విద్యా, ఉద్యోగాలు, రాజకీయాలలో రిజర్వేషన్స్ కల్పించి రక్షణ చట్టం కూడా ఏర్పాటు చేశారన్నారు. బీసీలకు రాజకీయ రిజర్వేషన్స్ కల్పించకపోవటం, రక్షణ చట్టం ఏర్పాటు చేయకపోవడంతో రిజర్వేషన్స్ వల్ల సరైన ఉపయోగం లేదని అన్నారు. అగ్నికుల క్షత్రియ రాష్ట్ర అధ్యక్షులు నాగిడి సాంబశివరావు మాట్లాడుతూ బీసీలను ఐక్యం చేయటానికి బీసీ కులాల వేదిక కృషి చేస్తుందని, తమ కులాల గుర్తింపు కోసం వచ్చే వారిని ప్రోత్సహిస్తూ, వారిని సమాజంలో నాయకులుగా నిలబెడతామని తెలియజేశారు. ఇప్పటికే కోస్తా, ఉత్తరాంధ్రలో సమావేశాలు ఏర్పాటు చేసి, అన్ని కులాల వారి అభిప్రాయాలు తీసుకున్నామని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సమావేశాలు నిర్వహించి, అందరి సమష్టి అభిప్రాయాలతో విధానాలు రూపొందించి లక్ష మందితో రాష్ట్ర రాజధానిలో బహిరంగ సభ ఏర్పాటు చేసి ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తామని తెలియజేశారు. అలాగే పలు కులాల రాష్ట్ర, జిల్లా నాయకులు, మేధావులు మాట్లాడుతూ ఈ వేదికకు తమ మద్దతు తెలియజేశారు. బీసీల అభివృద్ధి కోసం మిగతా కులాల వారందరూ సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో సంచార జాతుల రాష్ట్ర ఉపాధ్యక్షులు పసుపులేటి మనోజ్ కుమార్, నూర్ బాషా పొలిటికల్ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ బాదుల్లా, దాసరి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు సుబ్బయ్య, బీసీ చైతన్య సమితి అధ్యక్షులు బీసీ రమణ, యాదవ సంఘం నాయకులు ఓబులేసు యాదవ్, రాష్ట్ర రజక నాయకులు బద్వేల్ గురుమూర్తి, బోయ రాష్ట్ర నాయకులు డాక్టర్ మల్లెల భాస్కర్, తొగట వీర క్షత్రియ రాష్ట్ర నాయకులు మల్లికార్జున, సగర రాష్ట్ర నాయకులు రామచందర్ తదితరులు పాల్గొన్నారు.

జేబుదొంగను పట్టించిన వృద్ధురాలు

- ప్రభుత్వ ఆస్పత్రిలో నగదు కాజేస్తుండగా పట్టివేత
- రూ.70 వేల నగదు సురక్షితం



జేబుదొంగ గోవిందు (గులాబీ రంగు చొక్కా)ను పట్టుకున్న వృద్ధురాలు చినపాపమ్మ

మదనపల్లె రూరల్ : ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో వైద్య సేవల కోసం వచ్చిన ఓ వృద్ధురాలు.. తన కళ్లముందే కుమారుడి జేబును కత్తిరించి, డబ్బులు కాజేస్తున్న దొంగను చాకచక్యంగా పట్టుకున్న ఘటన శనివారం పట్టణంలో జరిగింది. సీటీఎంకు చెందిన చినపాపమ్మ(78) అనారోగ్యానికి గురికావడంతో ఆమెను పెద్దకుమారుడు శంకర మదనపల్లె ప్రభుత్వ జిల్లాఆస్పత్రిలో చూపించేందుకు ఇంటి నుంచి బయలుదేరారు. అయితే.. శంకర తమ్ముడు భాస్కర, గొర్రెల కోసం తీసుకున్న రూ.70 వేల రుణాన్ని సీటీఎం బ్యాంకులో చెల్లించాల్సిందిగా అన్నకు అందజేశాడు. నగదు తీసుకుని తల్లితో సహా శంకర బ్యాంకుకు చేరుకున్నాడు. అయితే నాలుగో శనివారం బ్యాంకుకు సెలవు కావడంతో, నగదుతో సహా తల్లిని తీసుకుని మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి చేరుకున్నాడు. ఓపీ రాయించేందుకు క్యూలైన్లో నిల్చుని ఉండగా, అప్పటికే శంకరను వెంబడిస్తూ వచ్చిన ముగ్గురు వ్యక్తులు అతడి వెనుక, ముందు నిల్చున్నారు. వారిలో నిమ్మనపల్లెకు చెందిన గోవిందు అనే వ్యక్తి, శంకర నగదు ఉంచుకున్న జేబును చాకచక్యంగా కత్తిరించి చోరీ చేసేందుకు ప్రయత్నించాడు. ఈ విషయాన్ని గమనించిన వృద్ధురాలు చినపాపమ్మ తెలివిగా వ్యవహరించి, జేబు దొంగ గోవిందును పట్టుకుని కేకలు వేసింది. ఇంతలో అతడితోపాటు వచ్చిన ఇద్దరు అక్కడి నుంచి పరారు కాగా, సెక్యూరిటీ సిబ్బంది జేబుదొంగను అదుపులోకి తీసుకుని అతడు దొంగిలించిన రూ.70వేల నగదును శంకరకు అందజేశారు. దొంగ గోవిందును అవుట్‌పోస్ట్ సిబ్బంది టూటౌన్ పోలీసులకు అప్పగించారు. వృద్ధురాలు చినపాపమ్మ ధైర్యం, చొరవను ఆస్పత్రి సిబ్బంది అభినందించారు.

పెళ్లి కుదరడం లేదని.. యువకుడి ఆత్మహత్య

వేముల : గత కొన్నాళ్లుగా పెళ్లి సంబంధాలు చూస్తున్నా పెళ్లి కుదరకపోవడంతో మనస్తాపం చెంది యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన వేముల మండలం వేల్పుల గ్రామంలో చోటు చేసుకుంది. ఈ సంఘటనకు సంబంధించి పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన మామిడి విష్ణువర్ధన్‌రెడ్డి(29) అనే యువకుడు సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తూ డిసెంబర్‌లో ఉద్యోగం మానేశాడు. అప్పటి నుంచి ఉద్యోగం కోసం వెతుకులాట ప్రారంభించారు. ఎక్కడా ఉద్యోగం దొరకకపోవడంతోపాటు స్థిరాస్తులు, భూములు లేకపోవడంతో అమ్మాయిని ఇచ్చేందుకు ఎవరూ ముందుకు రాలేదు. ఎన్ని సంబంధాలు చూసినా ఆస్తులు లేవని అమ్మాయిని ఇవ్వకపోవడంతో శనివారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో విష్ణువర్ధన్‌రెడ్డి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తల్లి కువైట్‌లో ఉండగా, తండ్రి కొంతకాలం క్రితం మృతి చెందాడు. ఈ సంఘటనకు సంబంధించి సోదరుడు కృష్ణారెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ప్రవీణ్ కుమార్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం

- గుర్తు తెలియని వాహనం ఢీకొని..
- మృతులు కుప్పం వాసులు



మృతి చెందిన లోకేష్, వెంకటేష్

బి.కొత్తకోట : ప్రయివేటు ఫైనాన్స్ పనులు చూసుకుని తిరిగి బైక్‌పై వెళ్తున్న ఇద్దరు ప్రయివేటు ఉద్యోగులను గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో.. దుర్మరణం చెందిన ఘటన శనివారం సాయంత్రం మండలంలోని తుమ్మనంగుట్ట సమీపంలోని రైల్వే స్టేషన్ వద్ద జరిగింది. పోలీసుల కథనం మేరకు వివరాలు. కుప్పం మండలం కాకిమడుగుకు చెందిన వెంకటేష్ (32), అనిమిగానిపల్లెకు చెందిన లోకేష్ (22)లు మదనపల్లెలోని బాలాజీ ఫైనాన్స్ సంస్థలో కలెక్షన్ బాయ్స్‌గా విధులు నిర్వహిస్తున్నారు. విధుల నిర్వహణలో భాగంగా ములకలచెరువుకు మదనపల్లె నుంచి బైక్‌పై వచ్చిన వీరు పనులు చూసుకుని తిరిగి మదనపల్లెకు బయలుదేరారు. వీరు రైల్వేస్టేషన్ సమీపంలోకి వెళ్తుండగా వెనుక వైపు నుంచి వస్తున్న గుర్తు తెలియని వాహనం బైక్‌ను బలంగా ఢీకొంది. దీనితో బైక్‌పై వెళ్తున్న లోకేష్, వెంకటేష్‌లు ప్రమాదానికి గురై రోడ్డుపైనే పడిపోయారు. ఇద్దరికి బలమైన గాయాలై తీవ్ర రక్తస్రావం కావడంతో ఘటనా స్థలంలోనే దుర్మరణం చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. ఈ ఘటనకు కారణమైన వాహనాన్ని గుర్తుపట్టేందుకు దర్యాప్తు ముమ్మరం చేశారు. ములకలచెరువు నుంచి మదనపల్లె వైపు వెళ్తున్న వాహనాలను పరిశీలించాలని పోలీసులు అప్పటికప్పుడు ముదివేడు, మదనపల్లె పోలీసులకు సమాచారం ఇచ్చారు. అలాగే ప్రమాదం జరిగిన సమయంలో వెళ్లిన వాహనాలను గుర్తించేందుకు సీసీ కెమరాలను పరిశీలిస్తున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం కోసం మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. మృతుల బంధువులు ఇంకా రాకపోవడంతో ఫైనాన్స్ సంస్థ సిబ్బంది మృతులను గుర్తించారు.

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురికి గాయాలు



గాయపడిన గిరిబాబు

మదనపల్లె రూరల్ : వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు వ్యక్తులు తీవ్రంగా గాయపడి మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ములకలచెరువు మండలం మద్దినాయునిపల్లె పంచాయతీ చంద్రరాజులపల్లెకు చెందిన ఆదినారాయణ(63) తన కోడలు వెంకటరత్నమ్మ(30)ను ములకలచెరువులో రైలు ఎక్కించేందుకు ద్విచక్రవాహనంలో బయలుదేరారు. మార్గంమధ్యలో కారు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డారు. గమనించిన స్థానికులు బాధితులను మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. మదనపల్లె వెటర్నరీ కార్యాలయంలో హెడ్‌క్లర్క్‌గా పని చేస్తున్న సీటీఎంకు చెందిన గిరిబాబు(60) విధులు ముగించుకుని ద్విచక్ర వాహనంలో కార్యాలయం నుంచి సీటీఎంకు బయలుదేరారు. మార్గంమధ్యలోని తట్టివారిపల్లె నాలుగు రోడ్ల జంక్షన్ సమీపంలో స్పీడ్‌బ్రేకర్ వద్ద ఎదురుగా వచ్చిన మరో ద్విచక్రవాహనం గిరిబాబును ఢీకొంది. ప్రమాదంలో ఆయనకు చేయి, కాలు విరిగి తీవ్రంగా గాయపడ్డారు. గమనించిన స్థానికులు వెంటనే ప్రభుత్వ జిల్లాఆస్పత్రికి తరలించారు. చికిత్సల అనంతరం మెరుగైన వైద్యం కోసం కుటుంబసభ్యులు బాధితుడిని బెంగళూరుకు తీసుకెళ్లారు. సంబంధిత పోలీసులు కేసులు విచారణ చేస్తున్నారు.

ఆత్మస్థైర్యంతో మహిళలు ముందుకు సాగాలి



జ్యోతి వెలిగించి సదస్సు ప్రారంభిస్తున్న ఐఆర్‌ఎస్ అధికారిణి కేఎస్ కీర్తిరెడ్డి

రాజంపేట : ఆత్మస్థైర్యంతో మహిళలు ముందుకు సాగాలని ఐఆర్‌ఎస్ అధికారిణి కేఎస్ కీర్తిరెడ్డి అన్నారు. శనివారం అన్నమాచార్య యూనివర్సిటీలో దపవర్ వితిన్-ఇన్‌స్పైయిర్ యంగ్ ఉమెన్ ఫర్‌గ్రేటర్ గోల్స్ అనే ప్రత్యేక సదస్సులో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. క్రమశిక్షణ, దృఢసంకల్పం, అంకితభావం వంటి లక్షణాలను ప్రతి మహిళ అలవర్చుకోవాలన్నారు. అప్పుడే తన లక్ష్యాన్ని చేరుకోగలదన్నారు. స్త్రీలో ఉన్న అంతర్యామి శక్తిని గుర్తించడం విజయానికి తొలిమెట్టు అన్నారు. మహిళలు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగితే ఏ రంగంలో అయినా విజేతగా నిలవగలరన్నారు. యూనివర్సిటీ వీసీ డాక్టర్ సాయిబాబారెడ్డి మాట్లాడుతూ విద్యార్థినుల్లో నాయకత్వ లక్షణాలను పెంపొందించేందుకు ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ నిర్వహించే సదస్సులు ఎంతగానో దోహదపడతాయన్నారు. అన్నమాచార్య ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ స్వర్ణలత మాట్లాడుతూ విద్య, క్రమశిక్షణతోనే మహిళలు సమాజంలో మార్పు తీసుకురాగలన్నారు. సాంకేతిక రంగాలలో మహిళలు ఎంతగానో ముందుంజలో ఉన్నారన్నారు. ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ ఇన్‌చార్జి వి.మౌనిశ్వరి మాట్లాడుతూ ఇది కేవలం మొదటి అడుగు మాత్రమే, మరిన్ని కార్యక్రమాల ద్వారా మహిళా విద్యార్థులకు నైతిక బలాన్ని అందించేందుకు కృషి చేస్తామన్నారు. సివిల్ టాపర్, ఐఆర్‌ఎస్ అధికారిణి కీర్తిరెడ్డి చేతుల మీదుగా సదస్సుకు జ్యోతి ప్రజల్వన గావించారు. సదస్సులో పీజీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సమతానాయుడు, ఫార్మసీ అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

కుటుంబ సమస్యలతో వివాహిత ఆత్మహత్య



పర్వీన్ మృతదేహం

మదనపల్లె రూరల్ : కుటుంబ సమస్యలతో భర్తతో గొడవపడి వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన శుక్రవారం రాత్రి మదనపల్లె మండలంలో జరిగింది. బసినికొండకు చెందిన మహమ్మద్ అలీ, పర్వీన్(36) భార్యాభర్తలు. వీరికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. మహమ్మద్ అలీ ఆటోడ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఇటీవల కొంత కాలంగా మహమ్మద్ అలీ మద్యానికి బానిస కావడంతో కుటుంబంలో సమస్యలు తలెత్తి తరచూ గొడవలు జరిగేవి. శుక్రవారం రాత్రి మహమ్మద్ అలీ మద్యం తాగి ఇంటికి రాగా.. వారి మధ్య మరోసారి గొడవ జరిగింది. దీంతో మనస్తాపం చెందిన ఆమె ఇంట్లోని మరో గదిలోకి వెళ్లి చీరతో ఫ్యానుకు ఉరి వేసుకుంది. గమనించిన కుటుంబ సభ్యులు తలుపులు బద్దలు కొట్టి ఆమెను హుటాహుటిన ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన ఆస్పత్రి, అత్యవసర విభాగ వైద్యులు ఆమె అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి విచారణ చేస్తున్నట్లు తాలూకా సీఐ కళావెంకటరమణ తెలిపారు.

• గండి క్షేత్రం.. భక్తజన సందోహం



గండి క్షేత్రం భక్తజన సందోహంగా మారింది. శ్రావణ మాసం తొలి శనివారోత్సవం వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. వీరాంజనేయస్వామిని దర్శించుకోవడానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. శ్రావణమాసంలో తొలి శనివారం నాడే ఆలయానికి రూ.13 లక్షల ఆదాయం వచ్చిందని అధికారులు తెలిపారు.

– చక్రాయపేట

జీతాల చెల్లింపులో ప్రభుత్వం విఫలం

కడప ఎడ్యుకేషన్ : విద్యాశాఖ జూన్ మాసంలో నిర్వహించిన ఉపాధ్యాయ బదిలీలలో బదిలీ అయిన ఉపాధ్యాయులలో చాలా మందికి జీతాలు చెల్లించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని యూటీఎఫ్ నాయకులు పేర్కొన్నారు. సంబంధిత సమస్యల పరిష్కారానికి శనివారం సాయంత్రం కడప డీఈఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మీరాజా, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయకుమార్, పాలెం మహేష్‌బాబు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 2 వేల మంది ఉపాధ్యాయులు జీతాల చెల్లింపులకు నోచుకోక తీవ్ర అవస్థలను ఎదుర్కొంటున్నారన్నారు. ఈ ధర్నాలో ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షులు జి.వెంకటసుబ్బారెడ్డి పాల్గొని మద్దతు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాధ్యక్షులు రవికుమార్, ట్రెజరర్ నరసింహారావు, జిల్లా కార్యదర్శులు సి.వి.రమణ, ఏజాస్ అహ్మద్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు డి.క్రిష్ణారెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు గంగన్న, లింగారెడ్డి, రామకేశవ, సుబ్బారెడ్డి, బత్తుల చంద్రశేఖర్, సుబ్బారెడ్డి, సూర్యకుమార్ తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా అండర్-16 మల్టీ డే మ్యాచ్‌లు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : ఏసీఏ అండర్-16 మల్టీ డే మ్యాచ్‌లు హోరాహోరీగా సాగుతున్నాయి. రెండవ రోజు శనివారం కేఓఆర్ఎం క్రికెట్ మైదానంలో అనంతపురం-కర్నూలు జట్ల మధ్య మ్యాచ్ జరిగింది. 75 పరుగుల ఓవర్ నైట్ స్కోరుతో మ్యాచ్‌ను ప్రారంభించిన కర్నూలు జట్టు 51.3 ఓవర్లలో 125 పరుగులకు ఆలౌట్ అయింది. ఆ జట్టులోని రుత్విక్ కళ్యాణ్ 30 పరుగులు చేశాడు. అనంతపురం జట్టులోని సంజయ్ 3, కిరణ్‌కుమార్ 3, సంతోష్ 2 వికెట్లు తీశారు. అనంతరం రెండవ ఇన్నింగ్స్ ప్రారంభించిన అనంతపురం జట్టు 65 ఓవర్లకు 7 వికెట్లు కోల్పోయి 257 పరుగులు చేసింది. ఆ జట్టులోని ఆర్.సాత్విక్ చక్కటి బ్యాటింగ్ చేసి 121 బంతుల్లో 131, ఆదినారాయణ 42 పరుగులు చేశారు. కర్నూలు జట్టులోని హితేష్ వర్ధన్ 3, వివేక్ 3 వికెట్లు తీశారు. దీంతో అనంతపురం జట్టు 342 పరుగుల ఆధిక్యంలో ఉంది. దీంతో రెండవ రోజు ఆట ముగిసింది.

వైఎస్‌ఆర్‌ఆర్ ఏసీఏ క్రికెట్ స్టేడియంలో..

వైఎస్‌ఆర్‌ఆర్ ఏసీఏ క్రికెట్ స్టేడియంలో జరుగుతున్న మరో మ్యాచ్‌లో చిత్తూరు-నెల్లూరు జట్లు పోటీ పడ్డాయి. 70 పరుగుల ఓవర్ నైట్ స్కోరుతో మ్యాచ్‌ను ప్రారంభించిన నెల్లూరు జట్టు 103.5 ఓవర్లలో 288 పరుగులకు ఆలౌట్ అయింది. అనంతరం రెండవ ఇన్నింగ్స్ ప్రారంభించిన చిత్తూరు జట్టు 5 ఓవర్లకు వికెట్ నష్ట పోకుండా 40 పరుగులు చేసింది. దీంతో చిత్తూరు జట్టు 22 పరుగుల ఆధిక్యంలో ఉంది.

శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుల పాత్ర కీలకం

- జిల్లా కలెక్టర్ డా.శ్రీధర్ చెరుకూరి
- అర్ధ వార్షిక నేర సమీక్షలో పాల్గొన్న డీఐజీ, ఎస్పీ



నేర సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్, చిత్రంలో డీఐజీ, ఎస్పీ



సమావేశంలో పాల్గొన్న పోలీసు, ఇతర శాఖల అధికారులు

కడప అర్బన్ : సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుల పాత్ర అత్యంత కీలకమైనదని.. పోలీసు, జ్యుడిషియల్ శాఖల అమలులో నిక్కచ్చిగా వ్యవహరిస్తేనే నేరాలను అరికట్టగలమని జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. శనివారం కడపలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 2025 అర్ధ వార్షిక నేర సమీక్షా సమావేశానికి ముఖ్య అతిథులుగా కలెక్టర్‌తోపాటు, కర్నూలు రేంజ్ డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్, జిల్లా ఎస్పీ ఈజీ అశోక్ కుమార్, జిల్లా ఫారెస్ట్ అధికారి వినీత్ కుమార్, సెవెంత్ ఏడీజే జీఎస్ రమేష్ కుమార్, డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ ఖదీరున్, ఫోరెన్సిక్ ఐ.టి నిపుణులు సురేంద్ర కుమార్ హాజరయ్యారు. ఈ సమీక్షలో జిల్లాలోని డీఎస్పీలు, సీఐలు, ఎస్‌ఐలు, అటవీశాఖ, ఫైర్, జైలు, జ్యుడిషియల్ శాఖల అధికారులతో.. ఆరు నెలల కాలంలో నమోదైన గ్రేవ్ - నాన్ గ్రేవ్, హత్య, పోక్సో, అత్యాచారం, డెకాయిటీ, రాబరీ, ప్రాపర్టీ, వాహనాలు దొంగతనం, మిస్సింగ్, చీటింగ్, ప్రాపర్టీ కేసులు, రోడ్డు ప్రమాదాలు, 174 సీఆర్‌పీసీ కేసులు, ఎన్‌ఫోర్స్‌మెంట్ వర్క్ తదితర అంశాలపై జిల్లా కలెక్టర్, డీఐజీ, ఎస్పీలు సమీక్ష నిర్వహించారు. ఈగల్ టీం ఆధ్వర్యంలో గంజాయి, డ్రగ్స్‌కి గుడ్ బై చెబుదాం, డ్రగ్స్ వద్దు బ్రో, మాదకద్రవ్యాల వినియోగాన్ని కట్టడి చేయాలనే కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ (అడ్మిన్) కె.ప్రకాష్ బాబు, అదనపు ఎస్పీ (ఏ.ఆర్) బి.రమణయ్య, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ ఎన్.సుధాకర్, కడప డీఎస్పీ ఎ.వెంకటేశ్వర్లు, జిల్లాలోని డీఎస్పీలు, సీఐలు, ఎస్‌ఐలు, రైల్వే, న్యాయ, రెవెన్యూ, ఫారెస్ట్, రవాణా, ఎక్సయిజ్, వైద్య, ఫైర్, జైళ్ల శాఖ, తదితర అధికారులు, ఈగల్ టీం సిబ్బంది పాల్గొన్నారు.

పోలీస్ అధికారులకు ఫైరింగ్ ప్రాక్టీస్ ప్రారంభం

పోలీస్ అధికారులకు ఫైరింగ్‌లో ప్రాక్టీస్‌ను డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్ నగర శివార్లలోని ఫైరింగ్ రేంజ్‌లో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి, ఎస్పీ ఈజీ అశోక్ కుమార్, డీఎఫ్ఓ వినీత్ కుమార్ పాల్గొన్నారు.